PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :207 | పేజీలు : 8 | వెల రూ.5 | గురువారం 20.08.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh




## రైతుల ఆదాయాన్ని పెంచడమే బ్యాంకుల లక్ష్యం: భట్టి



హైదరాబాద్,ప్రభాత సూర్యుడు స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. మీసేవలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. జ+మీజు కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.13,041 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం..



ఢిల్లీ, ప్రభాత సూర్యుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో రైలు, రహదారి మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేలా మొత్తం రూ.13,041 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో నాలుగు రైల్వే బహుళ మార్గాల ప్రాజెక్టులు కాగా, మరొకటి బిహార్‌లో రహదారి ప్రాజెక్టు. కేంద్ర కేబినెట్ ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టుల మొత్తం వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. ఇవి నాలుగు రాష్ట్రాల్లో రైల్వే మార్గాల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు రద్దీని తగ్గించేందుకు ఉద్దేశించినవి. ముఖ్యంగా గూడూరు–గుమ్మిడిపుండి 3, 4వ లైన్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.2,229 కోట్లతో గూడూరు–గుమ్మిడిపుండి 3, 4వ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఖరగ్‌పూర్–భద్రక్ 4వ లైన్‌కు రూ.3,352 కోట్లు, భద్రక్–హరిదాస్‌పూర్ 4వ లైన్‌కు రూ.1,583 కోట్లు, కటక్–పారాదీప్ 3, 4వ లైన్లకు రూ.2,286 కోట్లు కేటాయించారు. ఈ రైల్వే ప్రాజెక్టులు పూర్తయితే సరుకు రవాణా సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. మొత్తం మీద సుమారు 1.3 కోట్ల టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికుల రైళ్ల రాకపోకలు కూడా మరింత సులభతరం కానున్నాయి. అలాగే బిహార్‌లోని ముజఫర్‌పూర్–సీతామర్హి–సోన్‌బర్సా హైవే నిర్మాణానికి కూడా కాబినెట్ నుంచి ఆమోదం లభించింది. నాలుగు లైన్లతో నిర్మించే ఈ హైవేకు రూ.3,591 కోట్లు కేటాయించారు. ఈ రహదారి బిహార్ ప్రాంతాలకు మెరుగైన అనుసంధానాన్ని కల్పించడంతో పాటు నేపాల్ సరిహద్దు వైపు రవాణా సౌకర్యాలను బలోపేతం చేయనుంది.


## కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు..

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు ఉచిత పథకాలు, ప్రజాధనం వినియోగంపై తెలంగాణ హైకోర్టులో బుధవారం కీలక చర్చ జరిగింది. చర్చ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టబద్ధత లేని పథకాలకు ప్రజాధనం వృథా చేస్తే ఎలా అని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ రంగ సంస్థలను లాభాల్లోకి తెచ్చి.. ఆ డబ్బును ఉచిత పథకాలకు ఖర్చు చేయొచ్చు కదా అని ధర్మాసనం అభిప్రాయపడింది. భూసేకరణలో న్యాయం జరగక బాధితులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని హైకోర్టు పేర్కొంది. భూ బాధితుల సమస్యలపై ప్రభుత్వం ఏం చేస్తుందో గురువారం చెప్పాలని ఆదేశించింది. తదుపరి విచారణను మరుసటి రోజుకు వాయిదా వేసింది. కాగా, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయాలని




తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాదులు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు పథకాల లబ్ధి దారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌పై ఉన్న స్టేను ఎత్తి వేయటంపై హైకోర్టు గురువారం నిర్ణయం తీసుకోనుంది.



## బీఆర్ఎస్ నేతల.. గృహ నిర్బంధం

### టిమ్స్‌కు వెళ్లకుండా ఆటంకాలు

- హరీష్‌రావు, తలసాని, సబితా సహా పలువురు నేతల నిర్బంధం
- టిమ్స్‌పై ప్రభుత్వం వాస్తవాలను దాస్తోందన్న హరీష్‌రావు

హైదరాబాద్, ప్రభాత సూర్యుడు

హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో ఇటీవల ప్రారంభమైన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రిని సందర్శించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను బుధవారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్‌రావుతో పాటు మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, పార్టీ నేత మన్నె కృష్ణాంక్‌ను వారి నివాసాల వద్దే పోలీసులు అడ్డుకున్నారు. కోకాపేట్‌లోని హరీష్‌రావు నివాసం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి బయటకు వెళ్లకుండా నిరోధించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. టిమ్స్ ఆస్పత్రి నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. టిమ్స్‌ను తామే నిర్మించామని ప్రభుత్వం చెబుతుంటే, వాస్తవాలు ప్రజలకు తెలియకుండా బీఆర్ఎస్ నేతలను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన నిజాలు బయటపడతాయనే భయంతోనే ప్రభుత్వం హౌస్ అరెస్టులకు పాల్పడుతోందని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని విమర్శించారు.

### తలసాని, సబితా హౌస్ అరెస్టు..

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా ప్రభుత్వ చర్యలను ఖండించారు. టిమ్స్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజలకు నిజానిజాలు తెలియజేయడానికే ఆస్పత్రిని సందర్శించాలని నిర్ణయించుకున్నామని, అయితే ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి బీఆర్ఎస్ నాయకులను నిర్బంధించిందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అక్రమ నిర్బంధాలకు పాల్పడుతోందని విమర్శించారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్‌లకు చెందిన పలువురు పార్టీ ముఖ్య నాయకులను కూడా పోలీసులు గృహనిర్బంధం చేశారని చెప్పారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాసంలోనే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. టిమ్స్ సందర్శనకు వెళ్లకుండా ముందస్తు చర్యల పేరుతో నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. టిమ్స్ ఆస్పత్రి నిర్మాణం, అభివృద్ధిపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆస్పత్రిని సందర్శించాలని నిర్ణయించుకున్నారు. అయితే శాంతిభద్రతల దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టామని పోలీసులు పేర్కొన్నట్లు సమాచారం. ఈ పరిణామంతో టిమ్స్ అంశం మరోసారి తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## డీఎంకే నేతల అవినీతి వివరాలు నా దగ్గర ఉన్నాయి: సీఎం విజయ్



చెన్నై, ప్రజాపాలన : ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తమిళనాడు అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గత డీఎంకే ప్రభుత్వంలో మూడు శాఖల్లో జరిగిన అవినీతికి సంబంధించిన వివరాలు తన దగ్గర ఉన్నాయన్నారు. డీఎంకే నేతల అవినీతికి సంబంధించిన రెండు ఫైల్స్ తన టేబుల్‌పైనే ఉన్నాయని.. సమయం వచ్చినప్పుడు ఆ ఫైల్స్ తెరుస్తానని స్పష్టం చేశారు. తనను బలవంతం చేసి.. ఆ ఫైల్స్ ఇప్పుడే తెరిచేలా చేయొద్దని డీఎంకే నేతలకు వార్నింగ్ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణ పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలపై బుధవారం తమిళనాడు అసెంబ్లీలో చర్చ జరిగింది. చర్చ సందర్భంగా అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ డీఎంకే పార్టీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజలకు ఎప్పుడు.. ఏం చెప్పాలో నాకు తెలుసు.

# వెంకటాపురంలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**ఫోటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక**


ములుగు ఆగస్టు 19, ప్రభాత సూర్యుడు ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు జెండా ఎగురవేసి పరస్పరం అభినందనలు తెలువుకున్నారు. అనంతరం



వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ఫోటోగ్రాఫర్లకు మంజూరు చేయాలని కోరారు. వెంకటాపురం, వాజేడు మండలాల ఫోటోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని హర్షధ్వానాల మధ్య ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రెండోసారి చంద్రకళ స్టూడియో సదాశివ ప్రసాద్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా రాగం సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా కుప్ప సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా దారిశెట్టి నాగేశ్వరరావు, వంకాయల రాము, కోశాధికారిగా బంధ రవిబాబు ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా ఇల్లందుల శోభన్బాబు, బొల్లె నరసింహారావు, మాటూరు సతీష్, ప్రచార కార్యదర్శిగా వల్లి ప్రశాంత్ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా చెన్నం రాజు, ప్రసాద్, సంగం సాయి, అశోక్, కిషోర్, గౌరవ అధ్యక్షుడిగా వలుస రమేష్ ఎన్నికైనట్లు సంఘం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు చిట్యాల రవి, ఆనంద్, రంజిత్, భాను, గురు సాయి, తాజుద్దీన్, పానెం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# బీట్ ఆఫీసర్ దశదినకర్మలో నివాళి.

కారేపల్లి ఆగస్టు 19 ప్రభాత సూర్యుడు .కారేపల్లి మండల పరిధిలోని



వెంకీటీయా తండ గ్రామపంచాయతీలో ఇటీవల వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల కు బలైన బీట్ ఆఫీసర్ నవీన్ దశదినకర్మ బుధవారం వారి స్వగృహంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరయ్యారు. అనంతరం స్వర్గీయ నవీన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు సాగాడ సానుభూతి తెలుపుతూ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడ చైర్మన్ దుర్గాప్రసాద్, పీసీసీ సభ్యులు నారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాంబాబు, సొసైటీ డైరెక్టర్ ఐలయ్య, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ షెడ్యూల్ ట్రైబ్ కుల ధ్రువీకరణ పత్రాలు రద్దు చేయాలి

**ఆదివాసి సంక్షేమ పరిషత్**
**ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్**

ములుగు ఆగస్టు 19 ప్రభాత సూర్యుడుషత్ ఆధ్వర్యంలో నకిలీ షెడ్యూల్




ట్రైబ్ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని వెంకటాపురం మండల తహసిల్దార్ కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీష్ మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ తెగలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడేందుకు నకిలీ షెడ్యూల్ ట్రైబ్ కుల ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని గుర్తించి రద్దు చేయాలన్నారు . నకిలీ షెడ్యూల్ ట్రైబ్ ధ్రువీకరణ పత్రాల ద్వారా ఆదివాసులకు ఉద్యోగ పరంగా, రాజకీయంగా ,ఆర్థికంగా
అభివృద్ధి పరంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.నకిలీ ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పొందిన ఉద్యోగాలు, విద్యా ప్రవేశాలు, రిజర్వేషన్ ప్రయోజనాలు తదితరాలను నిబంధనల ప్రకారం సమీక్షించాలనీ కోరారు.నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సహకరించిన అధికారులపై ధ్వజం మెత్తారునిజమైన ఆదివాసీ/ షెడ్యూల్ ట్రైబ్అభ్యర్థుల హక్కులకు అన్యాయం జరగకుండా కుల ధ్రువీకరణ ప్రక్రియను పారదర్శకంగా, కఠినంగా అమలు చేయాలనీ మండిపడ్డారు. ప్రతి ఫిర్యాదును అధికారులు నిర్దిష్ట కాలపరిమితిలో విచారించి,
అర్హత లేని ధ్రువీకరణ పత్రాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.
నకిలీ షెడ్యూల్ట్ ట్రైబ్ కుల ధ్రువీకరణ పత్రాలను అరికట్టి,
నిజమైన ఆదివాసీ యువతకు విద్య, ఉద్యోగం, రాజకీయం మరియు రాజ్యాంగ రిజర్వేషన్ ,హక్కులను రక్షించాలనీ డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ వెంకటాపురం మండల అధ్యక్షుడు తుర్స కృష్ణ బాబు, తాటి రాంబాబు,కేక్కెం
శ్యామ్,నాగేష్,కుంజ రమేష్, సంతోష్, బాడిశ నరసింహారావు, కోర్స నరసింహారావు, కోర్స అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు పొన్నమన్న.. ప్రజా సమస్యలకు పరిష్కారం

**గ్రామాల్లో ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్**




(ప్రభాత సూర్యుడు) సిద్దిపేట: హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల గ్రామాల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ త్వరలో నిర్వహించనున్న "పల్లె పల్లెకు పొన్నమన్న.. పల్లె పల్లెలో ప్రజాపాలన'' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో జూమ్ ద్వారా ఆయా శాఖల అధికారులతో కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామాల్లో ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో సభ నిర్వహణకు అవసరమైన టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టమ్తో పాటు ఇతర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. గ్రామ సభలో ప్రజలు అందించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు స్వీకరించి, వాటిని నమోదు చేయడంతో పాటు ఏ స్థాయిలో పరిష్కరించవచ్చో వివరాలను నమోదు చేసి ప్రత్యేకంగా ఫైలింగ్ చేయాలని సూచించారు.సంక్షేమ పథకాల వివరాలతో జాబితాలు సిద్ధం చేయాలిగ్రామాల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వివరాలను అధికారులు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో కొత్తగా సభ్యుల చేర్పు, గ్యాస్ సబ్సిడీ, సన్నబియ్యం పంపిణీ, సన్నవడ్లకు బోనస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం, రైతు భరోసా, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, వడ్డీలేని రుణాల పంపిణీ, ఇందిరమ్మ చీరల పంపిణీ తదితర పథకాల లబ్ధిదారుల వివరాలతో జాబితాలు తయారు చేసి గ్రామ సభలో అందుబాటులో ఉంచాలని సూచించారు. అభివృద్ధి పనులపై సమీక్షగ్రామాల్లో వివిధ శాఖల



ద్వారా మంజూరైన పనులు, వాటి ప్రస్తుత పురోగతిపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి పనికి నిర్దిష్ట గడువును నిర్ణయించి, ఆ గడువులోగా పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు తదితర ప్రాథమిక సమస్యలను ముందుగానే గుర్తించి వాటి వివరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య, వారికి అందుతున్న పౌష్టికాహారం తదితర అంశాలపై కూడా పూర్తి సమాచారం అధికారుల వద్ద ఉండాలని తెలిపారు.హెల్ప్డెస్క్లు ఏర్పాటు చేయాలిగ్రామ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల వారీగా ప్రత్యేక హెల్ప్డెస్క్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించా రు. ప్రజలు తమ సమస్యలను సులభంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ఏర్పా ట్లు చేయాలని సూచించారు. హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పా ట్లను ప్రతి గ్రామంలో పర్యవేక్షిస్తూ, అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# సీపీ కనెక్ట్లో ప్రతిభ చూపిన 15 మంది పోలీసులకు అభినందన

ప్రభాత సూర్యుడు, సిద్దిపేట:



శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రోత్సహించేందుకు చేపట్టిన 'సీపీ కనెక్ట్' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మి పెరుమాళ్, ఐపీఎస్ 15 మంది పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలతో పాటు ప్రత్యేక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ రశ్మి పెరుమాళ్ సిబ్బందితో ముచ్చటించి, విధి నిర్వహణలో వారు కనబరిచిన ప్రతిభను అభినందించారు. గత కొన్ని రోజులుగా రాత్రి సమయాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి పాత నేరస్థులను పట్టుకోవడంతో పాటు దొంగతనాలకు అడ్డుకట్ట వేయడంలో కీలకంగా వ్యవహరించిన రిజర్వ్ ఇన్స్పెక్టర్ విష్ణు ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ మీర్ మహమ్మద్ అలీతో పాటు కానిస్టేబుళ్లు పి. పరిశరములు, జి. ప్రశాంత్, వి. జగన్, బి. రాజు, ఎన్. శివకుమార్, ఎం. బాలకృష్ణ, డి. చింటూ, వి. సందీప్ కుమార్, కె. అమృత్, ఈ. సోమయ్య, పి. కిరణ్, డి. బాబు, కె. సంజీవ్లను సీపీ కొనియాడారు. రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ సాంకేతికతను వినియోగించి నేరాలను అరికట్టడంలో సిబ్బంది చూపిన చొరవ అభినందనీయమని సీపీ పేర్కొన్నారు. ఇదే నిబద్ధతతో పోలీసు సిబ్బంది పనిచేస్తూ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా 'సీపీ కనెక్ట్' చొరవ ద్వారా మరింత బలమైన, సమైక్యమైన, ప్రజలకు వేగంగా స్పందించే పోలీసు బృందాన్ని నిర్మించేందుకు శాఖ నిరంతరం కృషి చేస్తుందని సీపీ రశ్మి పెరుమాళ్ తెలిపారు.

# కలం పట్టిన చేతి నుంచి ప్రజాసేవ వరకు..

**ప్రజల గుండెల్లో నిలిచిన గిరిజన నాయకుడు వీరన్న..**

కారేపల్లి ఆగస్టు 19 ప్రభాత సూర్యుడుసామాన్య కుటుంబంలో పుట్టి.. డిగ్రీ వరకు చదువుకొని.. ప్రజా సమస్యలపై కలం ఎక్కుపెట్టి జర్నలిస్టుగా ప్రస్థానం ప్రారంభించిన వీరన్న జీవన ప్రయాణం ప్రజాసేవ వైపు మలుపు తిరిగింది.ఒకప్పుడు ప్రజల సమస్యలను వార్తల రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆయన..నేడు అదే ప్రజల మధ్య నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న నాయకుడిగా గుర్తింపు పొందారు.మండలంలోని మారుమూల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్భయంగా కథనాలు రాస్తూ,వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చొరవ చూపడం ద్వారా వీరన్నకు ప్రజలతో అనుబంధం ఏర్పడింది.ప్రజల సమస్యలను కేవలం వార్తలకే పరిమితం చేయకుండా వారి కోసం ప్రత్యక్షంగా పనిచేయాలనే ఆలోచనే ఆయనను రాజకీయాల వైపు నడిపించింది.తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ స్ఫూర్తితో ముందుండి పనిచేసిన వీరన్న,



స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రజా సమస్యలపై తన గళాన్ని కొనసాగించారు.మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్కు సన్నిహితంగా ఉంటూ ఆయన రాజకీయ ప్రస్థానంలో తనవంతు పాత్ర పోషించారు.అనంతరం పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు.పదవి కంటే ప్రజలే ముఖ్యం పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్య ఉండటమే రాజకీయానికి అసలైన అర్థమని భావించే వీరన్న గత పదిహేనేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు చేరువయ్యారు.ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం,మృతుల కుటుంబాలకు బియ్యం పంపిణీ చేయడం,కష్టాల్లో ఉన్న వారికి తనవంతు చేయూతనివ్వడం వంటి కార్యక్రమాలతో ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు.రాజకీయాల్లో గెలుపోటములు సహజమే అయినా ప్రజలతో ఏర్పడిన బంధమే శాశ్వతమని ఆయన భావిస్తారు.రాములు నాయక్కు పార్టీ అధిష్ఠానం టికెట్ ఇవ్వని సమయంలోనూ వీరన్న ప్రజాక్షేత్రాన్ని వీడలేదు.ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజా సమస్యలనే ఎజెండాగా చేసుకొని అధికారులను ప్రశ్నిస్తూ,బాధితులకు భరోసానిస్తూ తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.నాడు కలంతో.. నేడు ప్రజల గొంతుగా..జర్నలిస్టుగా ఉన్నప్పుడు ప్రజా సమస్యలను కలంతో ప్రశ్నించిన వీరన్న.. ప్రజా జీవితంలోకి వచ్చిన తర్వాత అదే సమస్యలపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తున్నారు.ఇదే ఆయన ప్రస్థానంలో ప్రత్యేకతగా నిలుస్తోంది.కేసులు,రాజకీయ ఒత్తిళ్లు తన ప్రజా ప్రయాణాన్ని అడ్డుకోలేవని,ప్రజల కోసం ప్రశ్నించే గొంతు ఎప్పటికీ ఆగదనే ధోరణితో ముందుకు సాగుతున్నారు.ప్రజల మధ్య తనకు లభిస్తున్న ఆదరణ,విశ్వాసమే తన బలమని ఆయన భావిస్తున్నారు.మట్టిలో పుట్టిన మాణిక్యంలా..సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఓ యువకుడు కలాన్ని ఆయుధంగా చేసుకొని జర్నలిస్టుగా ఎదిగి.. తెలంగాణ ఉద్యమంలో భాగస్వామిగా నిలిచి.. అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజల మనిషిగా గుర్తింపు కోసం సాగిస్తున్న ప్రయాణమిది.కలం పట్టిన చేతులు ప్రజల కోసం ఆగవు.. పదవి పోయినా ప్రజలతో బంధం పోదు..ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ప్రజలపై నమ్మకం చెదరదు.. అందుకే వీరన్నకు ప్రజాక్షేత్రమే జీవితం.. ప్రజాసేవే లక్ష్యం.. ప్రజలే బలం అని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ను వేగవంతం చేయాలి

**గెజిటెడ్ అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన కీలకం**

ప్రభాత సూర్యుడు సిద్దిపేట:

రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎంపీడీవోలు, గృహనిర్మాణ




శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో గెజిటెడ్ అధికారి వెరిఫికేషన్ ఎంతో కీలకమని తెలిపారు. మండలాల వారీగా గెజిటెడ్ అధికారులకు కేటాయించిన గ్రామాల్లో లబ్ధిదారుల ప్రస్తుత నివాస గృహాల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి లబ్ధిదారుడి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి విచారణ అనంతరం సంబంధిత లాగిన్లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. వెరిఫికేషన్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, విచారణ పూర్తయిన వెంటనే సంబంధిత మండలాల ఎంపీడీవోలు లబ్ధిదారుల వివరాలను మంజూరు కోసం కలెక్టరేట్కు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ట్రాన్స్జెండర్ల రక్షణకు ప్రత్యేక ప్రొటెక్షన్ సెల్

**వేధింపులు, అన్యాయాలపై కఠిన చర్యలు**

ప్రభాత సూర్యుడు సిద్దిపేట:

ట్రాన్స్జెండర్ వ్యక్తులకు తక్షణ పోలీస్ సహాయం, రక్షణ అందించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మహిళా పోలీస్ స్టేషన్లో 'జిల్లా ట్రాన్స్జెండర్ ప్రొటెక్షన్ సెల్' ఏర్పాటు చేసినట్లు అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్



తెలిపారు. ట్రాన్స్జెండర్ వ్యక్తుల భద్రత, రక్షణను మరింత పటిష్టం చేయడంతో పాటు వారి ప్రాథమిక హక్కులు, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూడటమే సెల్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బాధితులకు అవసరమైన సమయంలో తక్షణ సహాయం అందించడం, వారి సమస్యలు, ఫిర్యాదులను వేగంగా స్వీకరించి పరిష్కరించడం, వేధింపులు, అన్యాయాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం కోసం ఈ సెల్ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ట్రాన్స్జెండర్ల సంక్షేమం, సంరక్షణకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని అదనపు డీసీపీ తెలిపారు. జిల్లా ట్రాన్స్జెండర్ ప్రొటెక్షన్ సెల్ నోడల్ అధికారిగా అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్ వ్యవహరిస్తారు. సెల్ నిర్వహణతో పాటు ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకునే బాధ్యతలను పీసీఆర్ ఇన్స్పెక్టర్ పి. మల్లేశం గౌడ్, సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.బి. దుర్గకు అప్పగించారు.సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని ట్రాన్స్జెండర్ వ్యక్తులు ఎలాంటి సమస్యలు ఎదురైనా భయాందోళనలకు గురికాకుండా ప్రొటెక్షన్ సెల్ అధికారులను సంప్రదించి చట్టపరమైన రక్షణ పొందాలని పోలీస్ శాఖ సూచించింది.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**ఫోటో జర్నలిస్టుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవి: ఎర్ర యాకయ్య**



కూకట్‌పల్లి, ఆగస్టు 19ప్రభాత సూర్యుడుశేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్‌లో కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. టిడబ్ల్యూజేఎఫ్ కూకట్‌పల్లి అధ్యక్షుడు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను, సమాజంలోని వాస్తవ పరిస్థితులను కెమెరా ద్వారా వెలుగులోకి తీసుకువస్తూ జర్నలిజంలో విశేష సేవలందిస్తున్న నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ శ్రవణ్ కుమార్, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎర్ర యాకయ్య మాట్లాడుతూ ఒక చిత్రం కోట్ల మాటలను పలకడంతో పాటు అనేక ప్రశ్నలను సమాజం ముందుంచుతుందని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, వారు అందిస్తున్న సేవలు సమాజానికి విలువైనవని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పుట్టి నగేష్, టిడబ్ల్యూజేఎఫ్ కమిటీ సభ్యులు సుజాత, సభ్యులు అనిల్ కిషోర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలి

**స్లాట్ బుక్ చేసుకునే సమయానికే క్లియరెన్స్ ఉండేలా చర్యలు : కలెక్టర్ మను చౌదరి**





మేడ్చల్, ఆగస్టు 19 ప్రభాత సూర్యుడు ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 22ఏలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అప్‌డేట్ చేసిన జాబితా ప్రకారం త్వరితగతిన క్లియర్ చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సబ్-రిజిస్ట్రార్లు, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం మేడ్చల్ మండలంలోని సబ్-రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించి 22ఏ నిషేధిత భూముల జాబితాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల క్లియరెన్స్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మేడ్చల్, దుండిగల్ తహసీల్దార్ల వద్ద ఉన్న 22ఏ జాబితాను, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోని వివరాలతో పాటు సంబంధిత సర్వే నంబర్ల వారీగా పరిశీలించారు.ప్రజలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేసుకునే నాటికే సంబంధిత భూమికి 22ఏ క్లియరెన్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. లింక్ డాక్యుమెంట్ల ఆధారంగా పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించి, అర్హత ఉన్న దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా క్లియర్ చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా యూఎల్‌సీ (అర్బన్ ల్యాండ్ సెయిలింగ్) కేసుల్లో పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ప్రకారం పరిశీలన పూర్తిచేసి జాబితా నుంచి క్లియరెన్స్ చేయాలని సూచించారు. 22ఏ నిషేధిత భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. స్లాట్ బుక్ అయిన అనంతరం పెండింగ్‌లో ఉన్న డాక్యుమెంట్లను కూడా వేగంగా పరిశీలించి పరిష్కరించేలా సబ్-రిజిస్ట్రార్లతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఆశోక్, మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, దుండిగల్ తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాలను ఏది రద్దుచేసినా ప్రజా ప్రతిఘటన తప్పదు బి ఆర్ ఎస్.



దుమ్ముగూడెం ఆగస్టు 19 ప్రభాత సూర్యుడు.గత కెసిఆర్ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను మరింత మెరుగ్గా ఇస్తామని అమలుచేయలేని వాగ్దానాలు ఇచ్చి ప్రజల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఖచ్చితంగా అమలు చేయాలని,కోరుతూ బి ఆర్ ఎస్ దుమ్ముగూడెం మండల కమిటీ ఆద్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ భరణి బాబు కి అందచేశారు.ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ నాయకులు మానే. రామక్రిష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ "ఆరు గ్యారెంటీ లు,420 హామీలతో ప్రజల్ని మభ్యపెట్టి గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచిన తర్వాత పేదల సంక్షేమాన్ని గాలికి వదిలి వేయడమే కాక,గత ప్రభుత్వ పథకాలను ఒక్కొక్కటిగా రద్దు చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. రైతుభీమా ప్రీమియం కట్టకుండా రైతు బీమాకు మంగళం పలకనుందని,మరోపక్క ఆడబిడ్డ వివాహానికి అండగా నిలిచేందుకు కెసిఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన కళ్యాణ లక్ష్మి,షా పథకాలను తులం బంగారం పెంచి ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ఆదేశాలు పేరుతో రద్దుచేయడానికి సిద్ధమైందని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వ పథకాలను ఇచ్చిన వాగ్దానాలు ప్రకారంగా ఖచ్చితంగా అమలు చేయాలని,లేకుంటే ప్రజల పక్షాన బి ఆర్ ఎస్. నిరంతరం పోరాడుతుందని,ప్రజల అభివృద్ధి,సంక్షేమాన్ని విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం కాయమన్నారు.ఏజెన్సీ లో తాలిపేరు ప్రాజెక్ట్ కాలువలను మరమ్మత్తులు చేపట్టకుండా వ్యవసాయాన్ని కూడా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ జాని పాషా, రేసు లక్ష్మి, మోతుకూరి రజిని,కొత్తూరు సీతారామారావు,అపకా వీరాజు, తునికి కామేశ్వరరావు, బొల్లి వెంకట్రావు, కాల్వ పూర్ణయ్య, దామెర్ల శ్రీనివాస్ రావు, ప్రజాపతినిధులు వాగే ఖాదర్ బాబు, గుండి రవి, మడకం జోగయ్య, నాయకులు తంతరపల్లి వెంకటేశ్వరావు,గోసంగి కిరణ్,లంక శివ, వాగే కృష్ణ, కుమారీకుంట సూర్య, పాయం, బాలకృష్ణ, వెంకటేష్,కాటిబోయిన వెంకటేశ్వర్లు, కొంద్రు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు..

# కేజీబీవీలో బాలికలకు అవగాహన కార్యక్రమం

**ఆకుల సత్యనారాయణ, మాధులిక తదితరుల ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన**



అందోల్, ఆగస్టు 19 ప్రభాత సూర్యుడు బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అందోల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యం, బాలికల భద్రత, సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, స్పష్టమైన కెరీర్ లక్ష్యాలు అవసరమన్నారు. విద్యార్థినులు తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉపాధి, వృత్తి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.బాలికల భద్రతపై సేఫ్ టచ్--అన్‌సేఫ్ టచ్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పించారు.



అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, ఫొటోలు పంచుకోవద్దని సూచించారు. అలాగే రక్తహీనత నివారణకు ఐరన్‌తో పాటు సమతుల్య పోషకాహారం తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని తెలిపారు.అనంతరం శానిటరీ ప్యాడ్ బ్యాంకు ద్వారా విద్యార్థినులకు 3,000 శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు. వాటి సరైన వినియోగం, భద్రపరిచే విధానం, వినియోగం అనంతరం సురక్షితంగా పారవేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌వో మధుకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఎంఈఓ కృష్ణ, ఎస్‌ఓ జ్యోతి, ఇన్‌చార్జి ఎస్‌ఓ సుకన్య, మెడికల్ ఆఫీసర్ శంకర్, జిల్లా సమన్వయకర్త పల్లవి, కౌన్సిలర్లు, ఎస్‌ఐ, ఐసీడీఎస్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ పుట్టినరోజు వేడుకలు





భద్రాచలం ఆగస్టు 19 ప్రభాత సూర్యుడుదేశవ్యాప్తంగా గిరిజన సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసినందుకు గాను నీతి అయోగ్ ద్వారా దేశంలోనే భద్రాచలం ఐటీడీఏ ను ఉత్తమ ఐటీడీఏగా జాతీయ పురస్కారాన్ని అందుకున్న మహోన్నత వ్యక్తి, కోయ భాషకు ప్రాధాన్యత కల్పిస్తూ, వారి జీవన విధానానికి ఆచారాలకు, కట్టు బాట్లకు, గిరిజన సంక్షేమం కోసం పాటుపడుతున్న గిరిజన బాంధవుడు, గిరిజన మహిళలకు ఆర్థిక చేకూర్పు కోసం భద్రగిరి మార్ట్ రూపకల్పన చేసి వారి జీవనోపాధికి చేయూత అందించిన మహనీయుడు, గిరిజన సంస్కృతి సాంప్రదాయాల ట్రైబల్ మ్యూజియము నెలకొల్పే తెలంగాణ సీఎం చేతులు మీదుగా బెస్ట్ అవార్డు అందుకున్న ఆదివాసి గిరిజనుల స్ఫూర్తి ప్రదాత అలాగే కోయ ఇలవేల్పుల పుస్తకాన్ని రూపొందించి ఆదివాసి గిరిజనుల చేత ఆదివాసి వికాసరత్న బిరుదు అందుకున్న స్ఫూర్తి ప్రదాత, గిరిజన సంక్షేమానికి విశేషంగా కృషిచేసిన ఆదివాసి సంక్షేమ వికాస రథసారథి భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ పుట్టినరోజు వేడుకలను ఐటిడిఏ యూనిట్ అధికారులు సిబ్బంది ఘనంగానిర్వహించారు. బుధవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ 33వ జన్మదినం సందర్భంగా ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది సమక్షంలో ఆయన పుట్టినరోజు జ్యోతి వెలిగించి కేక్ కట్ చేశారు.గిరిజన సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషికి యూనిట్ అధికారులు ప్రశంసించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఐటీడీఏ యూనిట్ అధికారులు సిబ్బంది ఆయనకు కేక్ తినిపించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డి సి ఆనంద్ కుమార్, ఏవో సున్నం రాంబాబు, ఏపీవో పవర్ వేణు, ఏడిఎంహెచ్వో సైదులు, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, హెచ్ఎన్ టిసి ఉదయ్ కుమార్, ఏ ఏ ఓ సంతోష్, ఏటీడీవో రాధమ్మ, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, డిఎస్ఓ ప్రభాకర్ రావు, మేనేజర్ ఆదినారాయణ వివిధ విభాగాల పర్యవేక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పాము కాటుకు గురైన మహిళ..



దుమ్ముగూడెం ఆగస్టు 19ప్రభాత సూర్యుడు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం బండారు గూడెం గ్రామానికి చెందిన కుంజా సీతమ్మ వయసు 50 ఈమె కూలీ పనులు నిమిత్తం పాత మారేడుబాకు చెందిన ఓ వ్యవసాయ రైతుకు నాట్లు వేయటం కొరకు కూలీగా వెళ్ళింది, నారు కట్టలు కట్టే సమయంలో ఓ గుర్తు తెలియని పాము బురద నీటిలో ఆమె కుడి కాలు భాగంలో కాటు వేయడంతో హుటా హుటిన ఆ రైతు ఆమెను దగ్గరలో ఉన్న నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా వెంటనే అక్కడి వైద్యులు డాక్టర్ పావని రెడ్డి స్పందించి యాంటీ స్నేక్ వీనం (ఇూాాం )అందించి ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనం ద్వారా మెరుగైన వైద్యం కొరకు భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# గిరిజన పట్టభద్రులకు బిఈడి కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ గడువు పొడిగింపు

**ఐటీడీఏ పీవో బి.రాహుల్**



భద్రాచలం ఆగస్టు 19 ప్రభాత సూర్యుడు2026-28 విద్యా సంవత్సరమునకు గాను రాష్ట్రంలోని ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన అభ్యర్థుల సంక్షేమార్థం
భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ప్రత్యేక గిరిజన బీఈడీ కళాశాలలో (28 వ బ్యాచ్) రెగ్యులర్ బి.ఎడ్ కోర్సులో ప్రవేశం నిమిత్తం ఏజెన్సీ షెడ్యూల్డ్ ప్రాంత గిరిజన పట్టభద్రుల నుండి నేరుగా దరఖాస్తులను ఈనెల 25వ తేదీ వరకు సమర్పించవచ్చని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాలలో
మొత్తం 100 సీట్లు కలవని, కళాశాలలో ప్రవేశానికి అర్హతలు తెలంగాణకు చెందిన అభ్యర్థులు ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంతములకు చెందిన గిరిజన పట్టభద్రులై ఉండవలెనని, డిగ్రీ పాసై కనీసం 40శాతం మార్కులు సాధించి ఉండాలని, సంబంధిత డిగ్రీ పరీక్షలో సాధించిన మెరిట్ ని బట్టి ఎంపిక జరుగుతుందని, ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారము మహిళలకు ప్రత్యేక కేటగిరి
వారికే సీట్లు రిజర్వు చేయబడ్డాయని, ప్రభుత్వ ఉత్తర్వులు నెంబర్ 14. తేదీ 12-04-2021, నెంబర్ 53. తేదీ 19-05-2009, ప్రకారం పూర్తి మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కళాశాలలో ప్రవేశానికి ప్రాస్పెక్టస్ దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయని, ఏటూరు నాగారం, ఉట్నూర్, మన్ననూరు ఐటిడిఏ కార్యాలయంలలోను
గిరిజన బిఈడి కళాశాల భద్రాచలం నందు ప్రోస్పెక్టరేస్ దరఖాస్తులు ఉచితంగా పొందవచ్చునని ఆయన అన్నారు. గిరిజన బీఈడీ కళాశాలలో 2026 2028 విద్యా సంవత్సరం వరకు గాను (28వ బ్యాచ్) రెండు సంవత్సరముల రెగ్యులర్ బిఎడ్ కోర్సులో ప్రవేశానికి ఈనెల 25వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తులను సమర్పించాలని అన్నారు.
మరిన్ని వివరాలకు 8247528404, 82477 98370, 99122 72959,9959575539
ఫోన్ నెంబర్లను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన కోరారు.



## సానియా మీర్జా రెండో పెళ్లి? వరుడు ఎవరో తెలుసా?


భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా రెండో వివాహం చేసుకోబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో కథనాలు తెగ వైరల్ అవుతున్నాయి. భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా రెండో వివాహం చేసుకోబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో కథనాలు తెగ వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం దుబాయ్‌లో నివాసముంటున్న ఆమె ఒక విదేశీయుడితో ప్రేమలో ఉన్నారని.. త్వరలోనే వారిద్దరూ పెళ్లి పీటలు ఎక్కబోతున్నారని రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అసలు ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలుసుకుందాం. వైరల్ అవుతున్న కథనాలు ఏమిటి? సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో చక్కర్లు కొడుతున్న సమాచారం ప్రకారం.. సానియా మీర్జా కొంతకాలంగా ఒక



విదేశీయుడితో సన్నిహితంగా ఉంటున్నారని తెలుస్తోంది. ఇప్పటికే ఆమె కుటుంబ సభ్యులు కూడా ఈ వివాహానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని.. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో దుబాయ్‌లోనే ఈ పెళ్లి వేడుక చాలా సింపుల్‌గా జరగనుందని ప్రచారం చేస్తున్నారు. అధికారిక స్పష్టత ఉందా? ఈ పుకార్లపై సానియా మీర్జా కానీ.. ఆమె కుటుంబ సభ్యులు కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఆమె టీమ్ నుంచి కూడా ఈ వార్తలను ధృవీకరించే సమాచారం వెలువడలేదు. కాబట్టి ప్రచారంలో ఉన్న ఈ కథనాలు కేవలం రూమర్లు మాత్రమేనని, వాటిలో ఎటువంటి వాస్తవం లేదని తెలుస్తోంది. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై తరచూ వచ్చే ఆధారం లేని సోషల్ మీడియా ప్రచారాల్లో ఇది కూడా ఒకటిగా కనిపిస్తోంది. సానియా మీర్జా వ్యక్తిగత జీవితం సానియా మీర్జా 2010లో పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌ను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అప్పట్లో వీరి పెళ్లి అంతర్జాతీయంగా ఎంతో చర్చనీయాంశమైంది. ఈ దంపతులకు 'ఇజాన్ మీర్జా మాలిక్' అనే కుమారుడు ఉన్నాడు. సుదీర్ఘకాలం కలిసి ఉన్న ఈ జంట 2024లో అధికారికంగా విడాకులు తీసుకుని విడిపోయారు. ఆ తర్వాత షోయబ్ మాలిక్ పాకిస్తానీ నటి సనా జావేద్‌ను రెండో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం సానియా ఏం చేస్తున్నారు? ఆట నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత సానియా మీర్జా తన పూర్తి సమయాన్ని కుమారుడు ఇజాన్ పెంపకానికే కేటాయిస్తున్నారు. తన కుమారుడితో కలిసి దుబాయ్‌లోనే స్థిరపడిన ఆమె, టెన్నిస్ అకాడమీల నిర్వహణ, వ్యాపారాలు,వివిధ సామాజిక కార్యక్రమాల్లో బిజీగా గడుపుతున్నారు. అలాగే పలు అంతర్జాతీయ క్రీడా పోటీలకు వ్యాఖ్యాతగా కూడా వ్యవహరిస్తున్నారు. సానియా మీర్జా రెండో పెళ్లి వార్తలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేవు. సానియా లేదా ఆమె కుటుంబం నుంచి అధికారికంగా స్పందించే వరకు ఈ వార్తలను కేవలం సోషల్ మీడియా రూమర్లుగానే పరిగణించాల్సి ఉంటుంది.

## సింపుల్ లుక్.. కుర్రకారు గుండెల్లో గుబులు!

అందం, అభినయంతో ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టిస్తున్న నభా నటేష్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. అందం, అభినయంతో ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటూ కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టిస్తున్న నభా నటేష్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. ఒకసారి పట్టు చీరలో సాంప్రదాయంగా కనిపిస్తూ.. లంగా ఓణీలో తెలుగింటి ఆడపడుచులా అందరి హృదయాలను దోచుకునే ఈ ముద్దుగుమ్మ.. మరొకవైపు మోడ్రన్ డ్రెస్ లతో యువతను ఆకట్టుకుంటుంది. ఫ్యాషన్ సెన్స్ కి కేరాఫ్ అడ్రస్ గా మారుతున్న నభా నటేష్ తాజాగా మరో అవుట్ ఫిట్ తో అందరి దృష్టిని ఆకట్టుకుంది. సింపుల్ లుక్.. స్టన్నింగ్ ఫోజ్.. తాజాగా షార్ట్ మినీ డ్రెస్ ధరించిన ఈమె..ఇందులో సింపుల్ గా కనిపిస్తూనే తన స్టన్నింగ్ ఫోజ్ లతో కుర్రకారును తన వశం చేసుకుంది. ముఖ్యంగా పింక్ అండ్ వైట్ సింపుల్ డ్రెస్ ధరించి,ఎటువంటి జ్యువెలరీ ధరించకుండా సింపుల్గా క్యాజువల్ గా కనిపించి అందరి హృదయాలను దోచుకుంది. పైగా వర్షం పడిన వేళ మెట్లపై స్టైలిష్ గా ఫోటోలకు ఫోజులిచ్చింది. మనసులో పల్లెటూరి అమ్మాయి భావాలు కలుగుతున్నాయి అంటూ పంచుకున్న క్యాప్షన్ ఆకట్టుకుంటుంది. మొత్తానికి అయితే లేటెస్ట్ లుక్కుతో సరికొత్త ఫోజులతో మెప్పించే ప్రయత్నం చేసింది నభా నటేష్. మోడల్ నుండి పాన్ ఇండియా స్టార్.. 1995 డిసెంబర్ 11న



కర్ణాటక రాష్ట్రం చిక్ మంగళూరు జిల్లాలో శృంగేరిలో జన్మించింది. మంగళూరులో ఇన్ఫర్మేషన్ సైన్స్ లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేసిన నభా నటేష్ కన్నడ ఇండస్ట్రీలో బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన వజ్రకాయ ద్వారా తన అరంగేట్రాన్ని చేసింది. 2015లో కన్నడ సూపర్ స్టార్ శివరాజు కుమార్ తో కలిసి ఈ సినిమా ద్వారా ఆమె అరంగేట్రం జరిగింది. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. ఇండస్ట్రీలోకి రాకముందు 2013లో సెమినా మిస్ ఇండియా బెంగళూరులో టాప్ టెన్ లో ఒకరిగా కనిపించింది. తొలి తెలుగు చిత్రం.. 2018లో తొలిసారి నన్ను దోచుకుందువటే అనే చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమయ్యింది. ఆర్ఎస్ నాయుడు దర్శకత్వంలో సుధీర్ బాబు, నభానటేష్ ప్రధాన పాత్రలో వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను పరవాలేదు అనిపించింది. పైగా అటు సుధీర్ బాబుకి కూడా ఇదే తొలి చిత్రం కావడం గమనార్హం. ఈ చిత్రం తర్వాత ఇస్మార్ట్ శంకర్, డిస్కో రాజా, సోలో బ్రతుకే సో బెటర్ వంటి చిత్రాలతో ఆకట్టుకున్న ఈమె మళ్ళీ కొంతకాలం గ్యాప్ తీసుకొని నాగబంధం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. నభా నటేష్ ప్రస్తుత చిత్రాలు.. ప్రస్తుతం నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా తెరకెక్కుతున్న స్వయంభు అనే యాక్షన్ అడ్వెంచర్ పీరియాడిక్ డ్రామాలో హీరోయిన్గా నటిస్తోంది. తెలుగు, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతున్న ఈ సినిమాతో పాన్ ఇండియా స్టేటస్ ను సొంతం చేసుకోవాలని పరితపిస్తోంది నభానటేష్. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. మరి భారీ అంచనాల మధ్య ఈనెల ఆఖరిలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా ఈమెకు ఎలాంటి స్టేటస్ ను అందిస్తుందో చూడాలి.

## బాలయ్య స్పీడ్.. డిసెంబర్ టార్గెట్ మిస్ అయ్యేలా లేదే!

బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో వస్తున్న కొత్త సినిమా రిలీజ్ డేట్ మీద రకరకాల గాసిప్స్ వైరల్ అవుతున్న విషయం తెలిసిందే బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో వస్తున్న కొత్త సినిమా రిలీజ్ డేట్ మీద రకరకాల గాసిప్స్ వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. వాయిదా పడే చాన్స్ ఉందని కూడా రూమర్స్ వచ్చాయి. అయితే సినిమాను ఎలాగైనా డిసెంబర్ లోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతి బరిలో దిగితే బాగుంటుందని కొందరు సలహా ఇచ్చినా బాలయ్య మాత్రం



వెనక్కి తగ్గలేదని టాక్. వచ్చే పండుగ సీజన్ కు ఇప్పటికే చాలా సినిమాలు క్యూ కట్టాయి కాబట్టి వాటన్నింటికీ దారి ఇచ్చి తన సినిమాను ముందే థియేటర్లలోకి దించాలని ఆయన నిర్ణయించుకున్నారట. ఇలాంటి ప్లానింగ్ లో ఉన్న టైమ్ లోనే బాలయ్యకు మోకాలి గాయం అయింది. తన 111వ సినిమా యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నప్పుడు గాయపడటంతో ఆయన రీసెంట్ గా సర్జరీ చేయించుకున్నారు. డాక్టర్లు కనీసం రెండు నెలల పాటు పూర్తిగా రెస్ట్ తీసుకోవాలని చెప్పారు. అయినా సరే సెప్టెంబర్ నుంచే మళ్లీ సెట్స్ లోకి అడుగుపెట్టాలని ఆయన భావిస్తున్నారట. తన వల్ల షూటింగ్ ఆలస్యమై నిర్మాతకు ఎలాంటి నష్టం రాకూడదనే ఉద్దేశంతోనే ఆయన ఇంత త్వరగా రికవరీ మీద ఫోకస్ పెట్టారని తెలుస్తోంది. బాలయ్య డెడికేషన్ కు తగ్గట్టుగానే చిత్ర యూనిట్ కూడా పక్కా షెడ్యూల్ రెడీ చేస్తోంది. సెప్టెంబర్ లో మెయిన్ సీన్స్ అన్నీ పూర్తి చేసి అక్టోబర్ నెలలో ప్యాచ్ వర్క్ కంప్లీట్ చేయాలని చూస్తున్నారు. ఆ తర్వాత నవంబర్ మొత్తం పోస్ట్ ప్రొడక్షన్ పనులకు కేటాయించేలా ప్లాన్ చేసుకుంటున్నారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే డిసెంబర్ లో సినిమా రిలీజ్ కావడం ఖాయం. డైరెక్టర్ గోపీచంద్ మలినేని, ప్రొడ్యూసర్ వెంకట సతీశ్ కిలారు కూడా ఇదే టైమ్ లైన్ తో వర్క్ స్పీడప్ చేసినట్లు సమాచారం. షూటింగ్స్ లో బాలయ్య గాయపడటం ఇదే తొలిసారి కాదు. తన కెరీర్ మొదట్లో బాబాయ్ అబ్బాయ్, భార్యాభర్తల బంధం సినిమాల టైమ్ లో కూడా ఇలాగే దెబ్బలు తగిలాయి. ఇక విజయేంద్రవర్మ షూటింగ్ సమయంలో మోకాలికి గాయం కావడంతో అప్పట్లో కొన్ని నెలల పాటు ఆయన విశ్రాంతి తీసుకున్నారు. అయినా సరే కెరీర్ స్టార్టింగ్ లో ఏడాదికి ఐదారు సినిమాలు చేస్తూ పని పట్ల తనకున్న కమిట్మెంట్ ఏంటో అప్పుడే నిరూపించుకున్నారు. ఇప్పుడు కూడా అదే తరహాలో ఆయన ముందుకు వెళ్తున్నారు. నిర్మాతల పట్ల బాలయ్యకు ఉన్న ఈ బాధ్యతను చూసి ఇండస్ట్రీ జనాలు ఆయన తండ్రి ఎన్టీఆర్ ను గుర్తుచేసుకుంటున్నారు. పల్లెటూరి పిల్ల సినిమా రోజుల నుంచే ఎన్టీఆర్ చేతికి చాలాసార్లు గాయాలు అయ్యాయి.ఒక దశలో కుడి చేతి వేళ్లకు పట్టు కూడా తగ్గింది. సర్దార్ పాపారాయుడు సినిమా టైమ్ లో మళ్లీ చేతికి దెబ్బ తగిలినా నిర్మాతలకు నష్టం రాకూడదనే ఉద్దేశంతో ఆయన కట్టుతోనే నటించారు. తండ్రికి ఉన్న అదే డెడికేషన్ ఇప్పుడు బాలయ్యలోనూ కనిపిస్తోందని సినీ వర్గాలు అంటున్నాయి. డిసెంబర్ నెల బాలయ్యకు గతంలో చాలా విజయాలు అందించింది. పట్టాభిషేకం సినిమాతో తన కెరీర్ లోనే తొలిసారి భారీ ఓపెనింగ్స్ రాబట్టారు. ఆ తర్వాత వచ్చిన లారీ డ్రైవర్ కూడా సంచలన విజయం సాధించింది. ఇక కరోనా తర్వాత జనాలను మళ్లీ థియేటర్లకు రప్పించిన అఖండ కూడా డిసెంబర్ లోనే రిలీజ్ అయింది. అయితే ఈసారి ఆ నెలలో గట్టి పోటీ ఉండబోతోంది.


## ఎన్టీఆర్ ఎమోషనల్ పోస్ట్.. తనని వీడి వెళ్ళిపోయిన బఘీర!

**ప్రస్తుతం మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు ప్రశాంత్ నీల్ అలాగే మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ ల కలయికలో భారీ సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. హీరోగానే కాకుండా నిర్మాతగా కూడా తారక్ కొత్త టర్న్ తీసుకోబోతున్నారు.అయితే ఇటీవల డ్రాగన్ షూట్ లో తగిలిన గాయంతో ప్రస్తుతం విశ్రాంతిలో ఉన్న తారక్ కి మరో హృదయ విదారక అనుభవం ఎదురైంది. తన పెంపుకు కుక్క బఘీర తనని వీడి వెళ్లిపోవడంతో తారక్ విపరీతంగా ఎమోషనల్ అయిపోయారు. సోషల్ మీడియాలో తన బఘీర తనని వీడి వెళ్లిపోవడంతో ఒక ఎమోషనల్ మెసేజ్ ని విడిచిపెట్టారు."బఘీరా, నువ్వు నా ప్రపంచంలోకి ఒక తోడుగా వచ్చి, నిశ్శబ్దంగా మా కుటుంబంలో ఒక భాగమయ్యావు. ప్రేమ, విశ్వాసం, అల్లరి మరియు నువ్వు మాత్రమే ఇవ్వగల ఒక రకమైన ఓదార్పుతో నా ఇన్ని రోజులను నింపేశావు. నువ్వు లేని లోటు నాకు పూడ్చలేని నిశ్శబ్దాన్ని మిగిల్చింది, కానీ నువ్వు వదిలి వెళ్ళిన ప్రేమ కూడా అంతే పెద్దది. నన్ను ఎంచుకున్నందుకు, నా పక్కన నడిచినందుకు, మరియు ఈ నాలుగేళ్ళను అనంతంగా మరింత అందంగా మార్చినందుకు ధన్యవాదాలు. స్వేచ్ఛగా పరుగెత్తు, నా చిన్నారి. నిన్ను ఎంతో ప్రేమించాము, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాము." అని తారక్ చేసిన ఎమోషనల్ పోస్ట్ తన అభిమానులని డాగ్ లవర్స్ ని కూడా ఎంతో భావోద్వేగానికి లోను చేసింది.**



## జైలర్ 2 ఫస్ట్ సింగిల్ కి ముహూర్తం ఫిక్స్.. మాస్ జాతరే!

సాధారణంగా సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లతో పోల్చుకుంటే హీరోలకు లైఫ్ టైం చాలా ఎక్కువ. అందులో భాగంగానే హీరోలు తమ సినిమాలతో వరుస ఫ్లాప్ లు చవిచూసిన ఏదో ఒక సినిమా పడితే మాత్రం గట్టి కంబ్యాక్ ఇస్తారు. సాధారణంగా సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లతో పోల్చుకుంటే హీరోలకు లైఫ్ టైం చాలా ఎక్కువ. అందులో భాగంగానే హీరోలు తమ సినిమాలతో వరుస ఫ్లాప్ లు చవిచూసిన ఏదో ఒక సినిమా పడితే మాత్రం గట్టి కంబ్యాక్ ఇస్తారు. అయితే అలా కంబ్యాక్ ఇచ్చేవరకు హీరోలు కూడా నిందలు మోయక తప్పదు. ఒక హీరో వరుసగా ఫ్లాప్ లు చవి చూశారు అంటే.. ఇక ఆ హీరో పనైపోయింది.. బుట్ట సర్దే టైం వచ్చేసింది అని కొంతమంది అంటే.. మరి కొంతమంది రిటైర్మెంట్ తీసుకోవాల్సింది.. ఇంకా ఎందుకు సినిమాల్లో చేస్తున్నారు అని అనే యాంటీ ఫ్యాన్స్ కూడా లేకపోలేదు. అలాంటి ఎన్నో విమర్శల నుంచి తనను తాను నిరూపిం చుకుంటూ అందరినీ ఆశ్చర్యపరిచారు రజినీకాంత్.ఒకప్పుడు అద్భుతమైన చిత్రాలతో బ్లాక్ బస్టర్ విజయాలతో సూపర్ స్టార్ గా పేరు సొంతం చేసుకున్న ఈయన గత కొంతకాలంగా సరైన సక్సెస్ లేక ఇబ్బందులు పడ్డారు. కానీ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో జైలర్ సినిమా చేసి మళ్లీ తనను తాను ప్రూవ్ చేసుకున్నారు రజినీకాంత్. అప్పటినుంచి ఆయన చేస్తున్న ప్రతి సినిమా కూడా మంచి విజయాన్ని అందుకుంటూ దూసుకుపోతోంది. ఇకపోతే ఆయన కెరీర్ను మళ్ళీ నిలబెట్టిన జైలర్ సినిమా సీక్వెల్ ఇప్పుడు త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే .ఒకవైపు షూటింగు వేగంగా జరుగుతుండగా మరొకవైపు చిత్ర బృందం సినిమా అప్డేట్స్ వదులుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా జైలర్ 2 నుంచి మేకర్స్ ఒక అదిరిపోయే అప్డేట్ విడుదల చేశారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అనౌన్స్మెంట్ ను తాజాగా పంచుకుంది. ఆగస్టు 21వ తేదీన ఈ సినిమా నుంచి మొదటి




పాటను విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఈ చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్ బ్యానర్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఈ విషయాన్ని అనౌన్స్ చేస్తూ రజినీకాంత్ లేటెస్ట్ పిక్ ని పంచుకుంది. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై అభిమానులలో విపరీతమైన క్రేజ్ ఏర్పడిన విషయం తెలిసిందే. మొదటి భాగం మ్యూజిక్ తో ఏ విధంగా థియేటర్లను షేక్ చేసిందో.. ఇప్పుడు ఈ సీక్వెల్ మూవీతో అంతకుమించి మ్యూజిక్ అందించడానికి అనిరుధ్ సిద్ధమయ్యారు. మరోవైపు ఈ సినిమాను అక్టోబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో చాలా గ్రాండ్గా విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాబోయే ఫస్ట్ సింగిల్ యూట్యూబ్లో సరికొత్త రికార్డు క్రియేట్ చేయడం ఖాయమని , మాస్ జాతరకి సిద్ధం అవ్వాలి అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ తో పాటు మొదటి భాగంలో నటించిన చాలామంది ఇందులో కొనసాగుతున్నారు. అలాగే విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. నిర్మల్ ఎడిటింగ్ బాధ్యతలను తీసుకున్నారు. దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555